క్లుప్తంగా

ఎరువులు, పురుగు మందులు వేయొద్దు

కాటారం: భారీ వర్షాల నేపథ్యంలో రైతులు సాగు చేస్తున్న పత్తి, వరి పంటల్లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, పురుగుల మందులు స్ప్రే చేయొద్దని మండల వ్యవసాయశాఖ అధికారిణి పూర్ణిమ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. వాతావరణ శాఖ సూచన మేరకు మరో మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాల కారణంగా ఎరువులు, పురుగుల మందులు వేస్తే న్యూట్రియంట్స్ రన్ ఆఫ్ అయి పంటకు అందకుండా వృథా అయిపోతుందని తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఎరువులు, పురుగుల మందులు వినియోగిస్తే ఫలితం ఉంటుందని సూచించారు.

చేయూత



కాటారం: మండలంలోని దేవరాంపల్లి పాఠశాలలోని విద్యార్థి తండ్రి క్లైపు శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి పాఠశాల ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందజేశారు. 75 కిలోల బియ్యం, కిరాణ సామగ్రి అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు విజయబాబు, కిషన్‌నాయక్, సంపత్, రాజయ్య, పరంసింగ్, వెంకటనర్సమ్మ, పద్మ, మాజిమ్, తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ఉష

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కోడిశాల పీహెచ్‌సీ పరిధిలోని లింగాలలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ ఉష రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. జ్వరపీడితుల నుంచి రక్తనమూనాలను సేకరించారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెచ్‌వీ పద్మ, హెల్త్ అసిస్టెంట్ సీతారాంనాయక్ పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు

వాజేడు: మండల పరిధిలోని టేకులగూడెం వైకుంఠధామం వద్ద గంజాయి సేవిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. టేకులగూడెంలోని వైకుంఠధామం వద్ద కొంత మంది యువకులు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. మండలంలోని టేకులగూడెం గ్రామానికి చెందిన జవ్వ గణేశ్, ఏటూరునాగారం మండల పరిధిలోని చిన్నబోయినపల్లికి చెందిన గుడిపటి గణేశ్‌లపై అనుమానం రావడంతో వారిని తనిఖీ చేసినట్లు తెలిపారు. వారి వద్ద రూ.12800 విలువ చేసే 256 గ్రాముల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మద్దేడు ప్రాంతం నుంచి కొంత సేవించడం కోసం మరికొంత అమ్మడం కోసం తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించగా గుడిపటి గణేశ్ పరారు కాగా జవ్వ గణేశ్‌ను అరెస్టు చేసి ములుగు జ్యుడీషియల్ కోర్టు పంపినట్లు వెల్లడించారు.

పోగొట్టుకున్న ఫోన్ల రికవరీ

- సీఈఐఆర్ ద్వారా స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు
- 117 ఫోన్లు బాధితులకు అప్పగింత



పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేస్తున్న సీఐ మల్లేశ్ (ఫైల్)

రేగొండ: నిత్య జీవితంలో మొబైల్ ఫోన్ భాగమైపోయింది. ఎటు వెళ్లినా.. ఇంట్లో ఉన్నా చేతిలో ఫోన్ లేనిదే జీవనం కొనసాగని పరిస్థితి. ప్రస్తుత సమాజంలో నిత్యావసర వస్తువుగా మారింది. ప్రతీ సమాచారంతో పాటు బ్యాంక్‌కు సంబంధించిన వివరాలను ఫోన్‌లో భద్రపరుచుకుంటున్నాం. అలాంటి మొబైల్ ఫోన్ ఎక్కడైనా పడిపోతే.. లేక ఎవరైనా దొంగలిస్తే ఎలాంటి టెన్షన్ పడకుండా వెంటనే సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే చాలు పోలీసులు వెతికి పట్టుకుని ఫోన్ అప్పగిస్తారు.

అందుబాటులోకి సీఈఐఆర్ పోర్టల్..

మిస్సింగ్ ఫోన్లను రికవరీ చేసేందుకు కేంద్ర టెలికం మంత్రిత్వ శాఖ సీఈఐఆర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పోగొట్టుకున్న, చోరీకి గురైన సెల్ ఫోన్లను ఈ ఆధునిక టెక్నాలజీ ద్వారా పోలీసులు గుర్తిస్తున్నారు. ఉమ్మడి రేగొండ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఐటీ సెల్ ఆధ్వర్యంలో మిస్సింగ్, చోరీకి గురైన మొబైల్స్‌ను రికవరీ చేసేందుకు స్పెషల్ టీంలు పని చేస్తున్నాయి. ఇప్పటి వరకు 185 మొబైల్స్ మిస్సింగ్, చోరీకి గురైనట్లు ఫిర్యాదులు రాగా 117 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు పోలీసులు అందజేశారు.

ఫిర్యాదు చేయడం ఇలా..

మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ముందుగా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లోకి వెళ్లగానే రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్, స్టోలేన్ మొబైల్ లింక్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. అందులో సెల్ ఫోన్‌కు సంబంధించిన 15 డిజిట్స్ ఐఎంఈఐ (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ)నంబర్, కంపెనీ పేరు, మోడల్ పేరు బిల్లులను నమోదు చేయాలి. తర్వాత ఓటీపీ కోసం మరో సెల్ నంబర్ ఇవ్వాలి. ఈ వివరాలను ఎంటర్ చేసిన తర్వాత ఫిర్యాదుదారుడికి ఐడీ నంబర్ వస్తుంది. అనంతరం ఆ మొబైల్ పని చేయకుండా చేస్తుంది. ఏ కంపెనీ అయినా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయగానే బ్లాక్ అవుతుంది. ఇక దాన్ని ఎవరూ వినియోగించలేరు. దీంతో పాటు ఫోన్ ఎక్కడ ఉందనే వివరాలు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోని ఐటీ సెల్‌కు వస్తుంది. లేదా నేరుగా మీ సేవలో దరఖాస్తు చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా సరిపోతుంది.

సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలి



"సెల్‌ఫోన్ పోయినా, ఎవరైనా దొంగలించిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. ఆ పోర్టల్ ద్వారా మొబైల్‌ను బ్లాక్ చేస్తారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా సరిపోతుంది. సెకండ్ హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేస్తే షాపు యాజమాని నుంచి రసీదు తీసుకోవాలి. దొంగిలించిన ఫోన్ అని తెలిసి ఎవరైనా కొనుగోలు చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

-సందీప్‌కుమార్, ఎస్సై, రేగొండ

ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి: మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 27న మండలంలోని ఇస్సిపేట మాజీ సర్పంచ్ కొడారి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని వస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని లక్ష్మిసాయి గార్డెన్స్‌లో మండల ముఖ్య నాయకులతో కేటీఆర్ పర్యటన ఏర్పాట్లపై, కార్యకర్తల సమీకరణపై సమీక్షా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, నాయకులు కోడారి రమేశ్, బెల్లంకొండ శ్యాంసుందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన కోడెల రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, యూత్ అధ్యక్షుడు తొటం నవీన్, టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్, నాయకులు పేరుమాండ్ల రవీందర్ గౌడ్, తాటిపల్లి శ్రీను, రజినికాంత్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న శిక్షణ



సూచనలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌బాబు

మల్హర్: విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలనే ఉద్దేశంతో మండలంలోని వల్లెకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం రెండో రోజు ఎంఈఓ లక్ష్మణ్‌బాబు క్లాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ కాంప్లెక్స్ సమావేశం ద్వారా గుణాత్మక విద్యను ఎలా బోధించాలి, నైపుణ్యతను ఎలా సాధించాలనే అంశంపై మండల ఉపాధ్యాయులకు, ఆర్పీలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుదర్శనం, తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



వెంకటాపురం(కె): తనిఖీ చేస్తున్న పోలీసులు



ఎస్ఎస్ తాడ్వాయిలో..

వెంకటాపురం(కె): అనుమానితులకు, కొత్త వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై కొప్పుల తిరుపతి రావు అన్నారు. జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు శుక్రవారం మండల పరిధిలోని బోదాపురం గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపించారు. ఈ తనిఖీల్లో పీఎస్సైలు తిరుపతి రెడ్డి, సాయికృష్ణ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలో కాటాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం వాహనాలను తనిఖీ నిర్వహించారు. జాతీయ రహదారిపై వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేసి వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

పుట్ట మధు పేదలకు చేసింది శూన్యం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాటారం: ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా పని చేసిన సమయంలో పుట్ట మధు పేదలకు చేసిన సాయం ఏమిలేదని అక్రమ సంపాదనే ధ్యేయంగా ముందుకెళ్లారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య మాట్లాడారు. కేటీఆర్ పుట్టిన రోజు పేరిట పుట్ట మధు ఎస్సీ ఎస్టీ బీసీ నాయకుల దగ్గర డబ్బులు వసూలు చేసి గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినికి సాయం చేశారని ఆరోపించారు. పుట్ట మధు రాజకీయ స్వార్థంతో పేద ప్రజలకు సేవలు చేస్తున్నట్లు నటిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో యూత్ అధ్యక్షుడు చిటూరి మహేశ్, కాంగ్రెస్ నాయకులు తెప్పెల దేవేందర్‌రెడ్డి, అంగజాల అశోక్, కదారి విక్రమ్, గడవేన దేవేందర్, రఘురాం, ఆత్మకూరి కుమార్‌యాదవ్, ఓంసింగ్ పాల్గొన్నారు.

మోరంచవాగు పరిశీలన



మోరంచవాగును పరిశీలిస్తున్న పోలీసులు

వెంకటాపురం(ఎం): మండలంలోని వెల్తుర్లపల్లి సమీపంలోని మోరంచవాగు రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి తెగిపోవడంతో సీఐ దారపు సురేష్, ఎస్సై చల్ల రాజు సందర్శించారు. మోరంచవాగు తెగిపోవడంతో ప్రయాణికులను దారి మళ్లించి భారీకేడ్లు ఏర్పాటు చేసినట్లు వారు వెల్లడించారు. చెరువుల్లో చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు.

నందనవనంగా ఐటీడీఏ గార్డెన్లు!



ఐటీడీఏ పరిధి హెచ్ఎన్‌టీసీ గార్డెన్లను పరిశీలిస్తున్న పీఓ చిత్రామిశ్రా



నిరుపయోగంగా ఉన్న గార్డెన్‌ను చదును చేస్తున్న డోజర్

- నిరుపయోగంగా ఉన్న గార్డెన్లు ఉపయోగంలోకి..
- ఐటీడీఏ, ఈజీఎస్ ద్వారా పండ్ల, పూలు, వెదురుసాగుకు శ్రీకారం

ఏటూరునాగారం: పదేళ్లుగా నిరుపయోగంగా ఉండి అక్రమణకు గురవుతున్న భూములపై ఐటీడీఏ దృష్టి సారించింది. ఐటీడీఏ గార్డెన్లు నందనవనంగా మారనున్నాయి. గతంలో పండ్లు, పూల మొక్కలను పెంచుతూ గిరిజనులకు ఉపాధి కల్పించడంతోపాటు శిక్షణ కూడా ఇచ్చేవారు. పదేళ్లలో ఐటీడీఏ పీఓలుగా పనిచేసిన అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ఆ భూములు సాగుకు ఉపయోగంలోకి లేకుండా పోయింది. ప్రస్తుత పీఓ చిత్రామిశ్రా ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ వద్ద ఉన్న 5 ఎకరాల భూమిలో వెదురుతోపాటు పూలు, పండ్లు, కూరగాయల మొక్కలను ఉపాధిహామీ పథకం ద్వారా నాటించి ఉపయోగంలోకి తీసుకురానున్నారు. ఇందు కోసం ఈజీఎస్, ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేసి ప్రభుత్వ భూమి ఎక్కడ వరకు ఉంది, ఎవరైనా కబ్జా చేశారా అని సర్వేలను చేపట్టారు. దీంతో కొంత మేర కబ్జా అయిన భూమిని ఐటీడీఏ వారు స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఈ రెండు ప్రాంతాల్లో మామిడి చెట్లు ఉండగా వాటిని అలాగే ఉంచి మరికొన్ని నాటి సాగులోకి తీసుకురానున్నారు.



కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు

ఎక్కెలలో కూడా..

మండల కేంద్రంలోని ఐటీడీఏకు కూతవేటు దూరంలోని హార్టికల్చర్ ట్రెనింగ్ సెంటర్(ఎక్కెల) వద్ద ఉన్న సుమారు 27 ఎకరాల భూమిలో కొంత మేర కబ్జాకు గురైనట్లు ఇటీవల అధికారులు చేసిన సర్వేలో తేలింది. దానిని కూడా స్వాధీనం చేసుకొని ఐటీడీఏ ప్రభుత్వ భూమి ఉన్నంత వరకు హద్దుల చుట్టూ వెదురు సాగు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతి పొందారు. ఈజీఎస్ ద్వారా మొక్కలను నాటించడం, పెంచడం ఇతర పనులు అన్ని కూడా ఈజీఎస్ ద్వారా చేసేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇక్కడ చుట్టూ వెదురుతోపాటు పండ్లు, పూలు, కూరగాయలను పండించి వాటిని మార్కెట్‌లో విక్రయించడానికి లేదా గిరిజన విద్యార్థులకు అందజేసేలా రూపకల్పన చేస్తున్నారు. ఈ పనులు పూర్తి అయితే ఐటీడీఏ పరిధిలోని భూములు సంరక్షణగా ఉంటాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్లాక్‌ల వారీగా విభజన

రెండు ప్రాంతాల్లో ఉన్న భూములను బ్లాక్‌ల వారీగా విభజించి సాగు చేయనున్నారు. ఎక్కెల వద్ద హెచ్ఎన్‌టీసీలో కరండ, పూలు, మామిడి, జామా, మునగ, సపోటా, నిమ్మలను ఒక్కో రకం ఒక్కో ఎకరంలో సాగు చేయనున్నారు. అలాగే ఫిష్ ఫాండ్‌ను అరెకరంలో సాగు చేస్తారు. అదేవిధంగా ఏటూరునాగారం గ్రామంలో హెచ్ఎన్‌టీసీలో కరండ, అలంకార, వెదురు, సపోటా, నిమ్మలను ఒక్కో రకం ఒక్కో ఎకరంలో సాగు చేయనున్నారు. ఇలా రకరకాల పండ్ల మొక్కలను పెంచేందుకు ఈజీఎస్ ద్వారా అనుమతి పొందారు. ఈ వర్షాకాలంలో గోతులు తీయించి మొక్కలు నాటనున్నారు. మరో ఏడాది వరకు ఈ రెండు ప్రాంతాలు కూడా నందన వనంగా మారనున్నాయి.

ప్రమాదకరంగా రోడ్డు

పలిమెల: మండలంలోని సర్వాయిపేట-బూర్గుగూడెం రహదారి నల్లవాగు సమీపంలో వర్షానికి కోతకు గురైంది. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోతకు గురైనా రోడ్డును ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కాల్వర్టుకు ఎగువ నుంచి చెట్లు, చేదారం కొట్టుకవచ్చి రోడ్డుకు అడ్డుపడడంతో కోతకు గురైనట్లు తెలిపారు. ఈ విషయంపై ఉన్నత అధికారులకు నివేదిక పంపించినట్లు పేర్కొన్నారు.



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని ప్రిన్సిపాల్ నర్సయ్య జిల్లా కేంద్రంలో భూపాలపల్లి డిపో మేనేజర్ ఇందుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కాళేశ్వరం నుంచి వచ్చే విద్యార్థులకు బొమ్మాపూర్ ఎక్స్ రోడ్ వద్ద బస్సు ఆపాలని తెలిపారు. పలిమెల మండలం సర్వాయిపేట, పంకేన, అంబటిపల్లి, సూరారం విద్యార్థుల కోసం నేడు(శనివారం) నుంచి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట అధ్యాపకులు ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

- ఎస్సై సాకపురం దివ్య



మాట్లాడుతున్న ఎస్సై దివ్య

రేగొండ (కొత్తపల్లిగోరి): గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై సాకపురం దివ్య తెలిపారు. శుక్రవారం కొత్తపల్లిగోరి మండలంలోని నిజాంపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో నేరాలను నియంత్రించేందుకు, అసాంఘిక కార్యకలపాలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణం కల్పించడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని తెలిపారు. అలాగే వనమహోత్సవంలో భాగంగా మొక్కను నాటారు. అనంతరం బాలయ్యపల్లిలో ఇటీవల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

- పార్టీ జిల్లా నాయకుడు రాజేందర్



మాట్లాడుతున్న రాజేందర్

భూపాలపల్లి రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయం ఖాయమని ఆ పార్టీ జిల్లా నాయకుడు దొంగల రాజేందర్ అన్నారు. శుక్రవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో మండల అధ్యక్షుడు పులిగుజ్జు రాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా రాజేందర్ హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పార్టీ కోసం కష్టపడి పని చేయాలన్నారు. నాయకులు శివరాత్రి వేణు, ఇచ్చతల విష్ణు, రోంటాల విప్లవ్ కుమార్ రెడ్డి, తుమ్మేటి రాంరెడ్డి, దామోదర్ రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ నాయకులు సత్తాను చాటాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని అన్నారు. రాకేశ్, సారన్న, మహేందర్, హరీష్, బాబు, నరేష్, పోతురాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(ఎం): స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సిద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు పైడాకుల మల్లేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని నల్లగుంటలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు భూక్య జవహర్‌లాల్, జిల్లా నాయకులు జినుకల కృష్ణాకర్‌రావు, వైద్యుల తిరుపతిరెడ్డి, మండల నాయకులు కారుపోతుల దేవేందర్, రెడ్డి శ్రీనివాస్, గంగుల రాజ్‌కుమార్, కాసర్ల సురేష్, శ్రీధర్‌రెడ్డి, కృష్ణమూర్తి, సంజీవరెడ్డి, శ్రీనివాస్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

కాళేశ్వరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యుడు జగదీష్‌ఖన్నా తెలిపారు. మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని సూరారం గ్రామంలో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా డ్రైడేను వైద్యారోగ్యశాఖ సిబ్బంది శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వారి వెంట వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

- జిల్లా ఉద్యాన అధికారి సంజీవరావు



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న సంజీవరావు

ములుగు రూరల్: ఉద్యానవన పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి సంజీవరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ములుగు మండలం అబ్బాపూర్ సమీపంలో సాగు చేస్తున్న బొప్పాయితోటను ఆయన సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగవుతున్న ఆయిల్‌పామ్, మామిడి, జామ, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, అరటి, బొప్పాయి, పసుపు, కూరగాయల సాగులో వర్షాల కారణంగా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. పండ్ల మొక్కలు ఒరిగితే మొదళ్ల సమీపంలో మట్టిని ఎగదోయాలని, కర్రల సపోర్టు ఏర్పాటు చేయాలని అన్నారు. పసుపు పంటల్లో నిలిచిన నీటిని తొలగించి ఎకరానికి 2 క్వింటాల వేపపిండి, 50 కేజీల యూరియాను వేసుకోవాలని చెప్పారు. ఆకుమచ్చ, వేరుకుళ్లు తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల బ్లీటైటాక్స్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వంగ, టమాట, చిక్కుడు వంటి కూరగాయాల సాగుకు అనువైన సమయమని అన్నారు. మామిడి సాగులో కొమ్మలు కత్తిరించిన తరువాత బ్యాక్టరీయా ఆకు మచ్చ తెగులు నివారణకు 10లీటర్ల నీటికి 6 గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్, 30 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని అన్నారు. 3 సంవత్సరాల వయసు కలిగిన ఆయిల్ పామ్ తోటల్లో చెట్ల మొదట్లో మగ పూత, ఆడపూతను అబ్లేషన్ పరికరంతో తీసి వేయాలని, 4 సంవత్సరాల వయసులో ఆయిల్ పామ్ తోటల్లో పరపరాగ సంపర్కానికి ఉపయోగపడే వీవిల్స్ పురుగులను వదలాలని, డ్రిప్ ద్వారా నీటిలో ఎరువులను కరిగించి మోతాదు ప్రకారం అందించాలని సూచించారు. సాగులో అవసరమైన సలహాలు, సూచనలకు 77801 32284, 77023 83263, 89777 14418 నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ డివిజనల్ అధికారి శ్రీకాంత్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికి ప్రాధాన్యం

వెంకటాపురం(కె): పార్టీ కోసం కష్టపడే వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం ఉంటుందని వెంకటాపురం(కె) పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సునీల్, సాంబశివ రావు, సాయికృష్ణ, గార్లపాటి రవి, కొండపర్తి సీత దేవి, కళాధర్, రమేష్, పల్నాటి ప్రకాశ్, మద్దుకూరి ప్రసాద్ ఉన్నారు.